# దైవోప హతులు

తూరుపు తెల తెల వారుతోంది. లోకం నిద్రనుంచి లేచి ఆవలిస్తున్నట్లు పక్షుల కిల కిల మంటున్నాయి. పల్లెటూళ్ళ నుంచి పాలవాళ్ళు కూరలవాళ్ళు సరుకులు వేసుకుని హడావుడిగా బస్తీకి వస్తున్నారు. బాల భాస్కరుని కిరణాలు ఆ పాడుబడ్డ వసారాలో పడుకున్న సుందరం మీద పడుతున్నాయి. కాని ఆ కిరణాలు సుందరాన్ని నిద్రనుంచి ఏమాత్రం లేపలేక పోయాయి. సూర్యునికి కోపం వచ్చి కిరణాలను తీవ్రతరం చేసి అతనిమీద సారించాడు. సుందరం ఒక్కసారి బద్ధకంగా వళ్ళు విరుచుకుని కళ్ల అరమోడ్పుగా తెరచి ఒక్కసారి ప్రక్కలకు చూచి, మళ్ళీ తనకేమీ పట్టనట్లు అటుతిరిగి పడుకున్నాడు. సుందరం పంతం చూసేసరికి సూర్యభగవానునికి కోపంతోపాటు పంతం కూడా హెచ్చింది. అంతకంతకు జోరుగా కిరణాల తీవ్రతను హెచ్చింప సాగాడు. ప్రత్యక్ష దైవమే పగబూనితే మొకరిల్లని మానవుడుంటాడా? సుందరం వీపు చుర్రు మనేసరికి విసుగుగా నిద్ర లేచాడు. కళ్ళు నులుముకొని చూసేసరికి బారెడు ప్రొద్దెక్కింది. దూరాన గుడిలో గంట ఎనిమిది కొట్టింది. సుందరం వసారాలోంచి లేచి మెట్లు దిగి క్రింది మెట్టుమీద కూర్చున్నాడు. వేపపుల్ల విరిచి నోట్లో పెట్టుకుని పళ్ళు తోముతూ చుట్టూ పరకాయించి చూచాడు. పది గజాల దూరంలోనే పాడుబడ్డ ఆ శివాలయం తనని చూసి నవ్వుతూ పలకరించింది. మొండిగోడలమీద పెరిగిన చెట్లు గాలికి ఊగుతూ చక్కని సంగీతాన్ని వినిపిస్తున్నాయి. ఆ చెట్ల కొమ్మలలోనుంచి సూర్యకిరణాలు ప్రసరిస్తూ నిత్యనూతన కాంతులను విరజిమ్ముతూ ఉన్నాయి. ఆ గోడల సందులలోనుంచి సగం పగిలిన శివలింగం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతిరోజూ నిద్రలేవగానే సుందరాన్ని పరామర్శించేది ఆ స్వామియే.

ఆ దేవాలయాన్ని, ఆ శివలింగాన్ని చూస్తుంటే సుందరం మనసులో ఆలోచనలు పరుగులు తియ్యడం మొదలు పెట్టాయి. తాను కుష్టురోగి. తల్లిదండ్రులు చేసిన పాపమో లేక ఏదైనా శాపమో తనకైతే తెలియదు కాని, తాను చేయని పాపానికి శిక్ష మాత్రం అనుభవిస్తున్నాడు. కాకపోతే చిన్ననాటి నుండి తాను కుష్టురోగిగా ఉండవలసిన కర్మ ఏమిటి? ఏమో! వారిని అనుకోవడం ఎందుకు? తాను ఏ జన్మలో ఏ మహా పాపం చేశాడో? ఈ జన్మలో అనుభవిస్తున్నాడు. తన తల్లిదండ్రులు కూడా ఎవరో తనకు జ్ఞాపకం లేదు. సరిగ్గా పుట్టిన ఏడాది తిరక్కుండానే తల్లిని పంపించేశాడు. తన పదవ ఏట తండ్రితో తాను కూడా ముష్టికి బయలుదేరేవాడు. "కళ్ళు, కాళ్లూ లేవు నారాయణ, కుష్టురోగులం మేము నారాయణ, కనికరించి మమ్ము నారాయణ, కాని డబ్బా వేయి నారాయణ.' ' అని తండ్రి పాడుతుంటే వెంటనడిచేవాడు. ఆవిధంగా తనకు పది ఏళ్ళు వచ్చేవరకూ ఎన్ని వూళ్ళు తిరిగారో జ్ఞాపకం లేదు. చివరకు ఈ ఊళ్ళో తన తండ్రి కన్నుమూశాక, ఈ ఊరే గత పదిహేను సంవత్సరాలుగా తనకు స్థిర నివాస మయింది. ఊరి చివర ఆ పాడుబడ్డ శివాలయమే తనకు

ఆశ్రయ మిచ్చింది. ఊరందరికీ తాను బరువైనా, ఆ దేవాలయానికి మాత్రం బరువు కాదు. శివాలయంలో శివుడు లేడంటారు. ఆ స్వామే లేకపోతే తనకు ఇక్కడ ఆశ్రయం లభించేదా? ఆ శిధిలాలయం చూస్తే జాలి వేస్తుంది. ఆ ఎత్తైన ప్రాకారాలూ, ఆ విశాలమైన కట్టడాలూ చూస్తుంటే, అది ఎంత శిధిలావస్థలో నున్నా, ఆ దేవాలయం ఒకనాడు ఎంతటి మహాదశను అనుభవించిందోనని అనిపిస్తుంది. చివరికి ఆ ప్రాకారాన్ని ఆనుకుని వున్న రాతి వసారాయే తనకు ఆశ్రయమిచ్చింది.

సుందరం లేచి వేపపుల్ల అవతల పారేసి కోనేరు వైపు నడిచాడు. ఆ శిధిలాలయం - పైకి శిధిలంగా ఉన్నా తనకు ఆశ్రయం ఇచ్చినట్లు, ఆ కోనేరులోని నీరు కూడా పైకి పాచిపట్టివున్నా లోపల స్వచ్ఛంగా ఉంది. సుందరం ముఖం కడుగుకుంటూ నీటిలో తన ప్రతిబింబం చూసుకున్నాడు. ఒక విషాదహాసం అతని పెదిమలపై దొర్లింది. తన కుష్టు ముఖం తనను వెక్కిరించింది. ఎంత విచిత్రం! తన పేరు సుందరం. రూపం! దాన్ని గురించి ఊహించకూడదు. తనకు అంత మంచి పేరు పెట్టుకున్న తల్లిదండ్రుల నేమనాలి? తన వెర్రిగాని కాకిపిల్ల కాకికి ముద్దన్నట్టు, తన తల్లిదండ్రుల కంటికి తను అంత ముద్దుగా ఉండేవాడు కాబోలు.

సుందరం ముఖం కడుక్కోవడం పూర్తిచేసి తిరిగి వచ్చి వసారాలో కూర్చున్నాడు. ఆకలి దహించేస్తోంది. రాత్రి ఏ తల్లీ అన్నం వేయలేదు. ముష్టిలో వచ్చిన డబ్బులన్నీ పోగుచేస్తే నలభై పైసలు తేలాయి. "పోనీలే దానితో రెండు ఇడ్లీలు తిని మళ్ళీ ముష్టికి బయలుదేరవచ్చు" అనుకొని లేచాడు.

అంతకంతకు ఎండ పెరుగుతోంది. మైలున్నర నడిస్తేనేగాని ఊళ్ళోకి వెళ్ళడం పడదు. ఆకలి చేత అడుగులు త్వరగా పడడం లేదు. ఉస్సురంటూ అల్లాగే నడచి వెళ్ళాడు. దూరాన్నుంచో హోటల్ కంట పడగానే, ప్రాణం లేచి వచ్చింది. కాళ్ళకు శక్తి పుంజుకుంది. నడక వేగం హెచ్చించి ఎలాగైతేనేం హోటల్ దగ్గరికి చేరాడు. చౌరస్తా స్తంభంపై గడియారం 9-30 గం. చూపెడ్తోంది. హోటల్‌ని సమీపించే సరికి పేదకు పెన్నిధి దొరికినట్లనిపించింది. నోటంట నీరూరడం మొదలు పెట్టింది. అదే ధ్యాసలో హడావుడిగా రెండు మెట్లెక్కాడు. అంతే .... అప్రయత్నంగా వెంటనే వెనక్కి తిరిగి దిగి ప్రక్కగా నిల్చున్నాడు. ఎదురుగుండా "కుష్టురోగులు లోనికి రాకూడదు" అనే పెద్ద అక్షరాలు ఎర్రగా కోపంతో తనవంక చూస్తూ కన్పించాయి. చిన్ననాడు ముష్టిపాటల కోసం నేర్చుకున్న అక్షరాలు చదవడానికి ఉపయోగించాయి.

ఆ అక్షరాలు చూడగానే సుందరానికి కళ్ళలో నీళ్లు తిరిగాయి. తాను ఎరిగి ఏ పాపమూ చేయలేదు. కాని ఎందుకు తనకీ శిక్ష? సిద్ధాన్నం ఉన్నా ఉపయోగించుకోలేని దౌర్భాగ్యుడు తను. ఆ ప్రక్కనే ఎంతోసేపు నిలబడ్డా వచ్చే పోయేవారేగాని తనను గూర్చి పట్టించుకునే వారేలేరు. మధ్య ఒకటి రెండుసార్లు క్లీనరు ఎవడో బయటికి వస్తే రెండు ఇడ్లీలు వేయమని అడిగాడు. అతను అలాగేనని వెళ్ళాడేగాని మళ్ళీ అయిపులేడు. చివరకు ఎల్లాగయితేనేం హోటల్ అయ్యరు తంబాకు ఉమ్మడానికి బయటకు వస్తే తనకి కావలసింది చెప్పాడు సుందరం. బేరం పోగొట్టుకోలేని అయ్యరు తమ్మి చొక్కామీదా పడేటట్లు "రెండిడ్లీ బయట పార్శిల్" అని గావుకేక వేసి సర్వరుకు ఆర్డరిచ్చాడు. సర్వర్ పొట్లాం తీసుకువస్తూ బయటకు వచ్చి గూడకట్టు పైకి ఎత్తుకుంటూ, ఎన్నా ఇది .... ఇంద ఆలసింగా వత్తివే. ఇప్పుడుదా ఇడ్లీ యారు పూడుత్తురు?" అని గొణిగి "దుడ్డు ఏది?" అన్నాడు సుందరంతో. సుందరం డబ్బులను మెట్టుమీద పెట్టాడు. సర్వరు ఇడ్లీ పొట్లాన్ని ఎత్తి సుందరం చేతిలోకి మెట్టు పైనుంచే విసిరివేశాడు. ఇద్దరి మధ్యా దూరం ఉండడంతో పొట్లాం చేయి తప్పి క్రిందపడి

పగిలిపోయింది. ఒక యిడ్లీ, కొంత పచ్చడీ నేలమీద పడ్డాయి. "ఏమి బాబయ్యా! కొంచెం నెమ్మదిగా వేయరాదా?" అన్నాడు సుందరం వంగి ఇడ్లీని ఆకులోకి ఎత్తుకుంటూ. సర్వరు కోపంతో "ఏమిటయ్యా! కుష్ఠోడివి. నిన్నుదా ముట్టుకొమ్మందువా?" అన్నాడు. సుందరం ఏమనగలడు? ఆ ఇడ్లీలను చూచి సుందరం "ఏమి బాబయ్యా! ఇడ్లీ ఇల్లాగుంది? పిండి పిండి, ఉడకనైనా లేదే!" అన్నాడు. సర్వరు - "పో పో అప్పా .... ఆలిసిమైనా ఇస్తిమి .... సంతోషించు" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

ఆకలి రుచి ఎరుగదు. కాలే కడుపుకు మండే గంజి అన్నట్లు సుందరానికి ఆ నిలవ ఇడ్లీలు - ఆ ఉడకని ఇడ్లీలే, పంచభక్ష్య పరమాన్నాలు లాగా అనిపించాయి. అవి తినేసి మునిసిపల్ పంపు దగ్గరకు వెళ్ళి కడుపునిండా మంచినీళ్ళు త్రాగి ముష్టికి బయలుదేరాడు.

వేసవికాలపు టెండ బుర్ర మాడ్చేస్తోంది. అసలే ఆలస్యంగా బయలుదేరాడేమో, సుందరానికి ఏవో కొద్దిగా బియ్యం మాత్రం దొరికినాయే గాని, అన్నం మాత్రం దొరకలేదు. ఆకలి మండిపోతోంది. జేబులో నయాపైసా లేదు. అప్పుడే ఒంటిగంటయింది. ఆ బియ్యం తీసుకుని ఎప్పుడు ఇంటికి వెళ్ళేటట్లు? ఎప్పుడు వండుకునేటట్లు? ఎప్పుడు తినేటట్లు? కాని తప్పదుగా! భారంగా అడుగులు వేసుకుంటూ ఇంటిదారి పట్టాడు. దారిలో ఒక ఇంటిముందు నానా కోలాహలంగా ఉంది. ఆ మేడముందు రోడ్డు కిరువైపులా కప్పేటట్లు బ్రహ్మాండమైన పందిరి వేశారు. లోపలకీ, బయటకీ వచ్చేపోయే జనంతో ఇల్లు నానా సందడిగా వుంది. అది పెళ్ళివారిల్లు అని గుర్తు పట్టడానికి ఎంతోసేపు పట్టలేదు సుందరానికి. పందిరి క్రిందనుంచుని సేద తీర్చుకుంటూ ఒక్క క్షణం ఆగాడు సుందరం. పెళ్ళివారి తాలూకు పెద్దమనిషి ముష్టివాళ్ల ఎవరో వస్తే వాళ్ళని పొమ్మని గట్టిగా అరుస్తున్నాడు. అది చూసి బరువుగా నిట్టూర్చి ముందుకు సాగాడు సుందరం. కొంచెం ముందుగా ఒక ఎంగిలి విస్తరికుప్ప ముందు ఒక యానాది వాళ్ళ గుంపు కూర్చుని, తిని పారేసినవి తింటూ ఏరుకుంటున్నారు. కుక్కలు కూడా వారితో భాగం పంచుకోబోయేసరికి అదలించి కొడ్తున్నారు. ఆ కుక్కలు వారు దూరంగా ఏరుకుని పారేసిన విస్తళ్ళ దగ్గరకుపోయి ఉన్న కొంచెం తినడానికి వాటిలో అవి కొట్లాడుకుంటున్నాయి.

సుందరానికి ఆ పదార్థాలు చూస్తుంటే నోరూరింది. ఆకలి మరీ అల్లరి చేయడం మొదలు పెట్టింది. తాను కూడా ఏదో ఒకటి తినకపోతే ప్రాణాలు నిలిచేటట్లు లేవు. ఏమైనా పెట్టమంటూ ఆ యానాదుల దగ్గరికి వెళ్ళాడు. వాళ్ళు అతన్ని చూడగానే అసహ్యించుకుంటూ "పో, పో, మా దగ్గరకు రాకు" అని కసిరి కొట్టారు. అభిమానమనేది ఏనాడో చచ్చిపోయింది. ఈ పీడను వదిలించుకోవడానికి ఒక ఎంగిలి విస్తరి దూరంనుంచే సుందరం దగ్గరకు విసిరివేశారు వాళ్ళు. అతను దగ్గరకు వస్తే అతని వ్యాధి తమకు ఎక్కడ అంటుకుంటుందో అని భయపడడం వారి ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

అసలే వాళ్ళు పారవేసిన విస్తరిలో తినదగ్గది కొంచెంగా ఉంది. అందులో కొంత వాళ్ల విసరడంలో క్రిందపడిపోయింది. తన దౌర్భాగ్యానికి విచారిస్తూ సుందరం అదే తీసుకున్నాడు. విస్తరి విప్పి చూసేసరికి అతని ప్రాణం ఉసూరుమంది. అందులో ఉన్నది గట్టిగా మూడు ముద్దలకు కూడా రాదు. ఇంతలో దొడ్డి తలుపు తీసి ఎవరో పనిమనిషి కొన్ని విస్తళ్ళను బయట పారేసింది. సుందరం తూనీగలాగ పరుగెత్తి ఆ విస్తళ్ళ మీద కలబడ్డాడు. అవైనా ఏడెనిమిది కంటె ఎక్కువ లేవు. అతనితో పోటీకి యానాది వాళ్ళ కుర్రవాడు రాబోయాడు. పెద్ద యానాది "ఆడకుబోకురా .... ఆట్నీ కుష్ఠునాయాలు ముట్టుకున్నాడు" అని కేక వేశాడు. చేసేది ఏమీలేక తనలో తనే పళ్ళు పట పటా కొరుక్కున్నాడు సుందరం.

కొద్దిదూరంలో కుక్కలు గయ్యిమని అరుపులు మొదలు పెట్టాయి. ఏమిటా అని సుందరం అటు చూచాడు. ఒక చీడకుక్క మిగిలిన కుక్కలతో వాటాను పంచుకోడానికి ప్రయత్నిస్తోంది. మిగిలిన కుక్కలన్నీ అంతసేపూ పోట్టాడుకుంటున్నా, ఈ చీడకుక్కని తరమడంలో మాత్రం అవన్నీ ఒక్కత్రాటిపై నిలిచాయి. అందులో ఒక పెద్దకుక్క, చీడకుక్కను కరిచి మరీ తరిమికొట్టింది. అది "కుయ్యో' ' మంటూ తోక ముడుచుకు పరుగెత్తి అటుఇటు తిరిగి యానాదుల వైపు వెళ్ళింది. ఆశగా వారివంక నోరు తెరుచుకు చూస్తూ తోకాడించింది. అందులో ఒకడు ఒక రాయి తీసి సూటిగా గురిచూచి, దాని కాలికేసి కొట్టాడు. అది "కుయ్యో"మని ఏక బిగిని కూత మొదలు పెట్టి, తోక ముడిచి దెబ్బతిన్న కాలు పైకెత్తి మూడుకాళ్ళమీద పరుగెడుతూ సుందరం వైపు వచ్చింది. వచ్చి సుందరానికి కొంచెం దూరంలో కూర్చొని దెబ్బతిన్న కాలు నాక్కోవడం మొదలు పెట్టింది. తర్వాత సుందరం ముందున్న ఆకులవైపు ఆశగా చూస్తూ నాలిక చాపి ముందుకాళ్ళతో నేలను గీకుతూ, "ఊః ఊః" అని కూయడం మొదలు పెట్టింది. దాన్ని చూసే సరికి సుందరానికి జాలివేసింది. ఇద్దరి పరిస్థితులూ ఒకేవిధంగా ఉన్నాయి. మనుష్యులకు వలెనే, జంతువులకు కూడా రోగిష్టులు, బలహీనులు అంటే చులకన కాబోలు అనుకుంటూ, తన ముందున్న దాంట్లో కొంచెం దానికి విసిరేశాడు. అది తిని, అది తోకాడిస్తూ ఇంకా చేరువకి వచ్చింది. ఆ విస్తళ్ళలో మిగిలింది ఇద్దరకూ ఆకలి తీరేలాగా సరిపోయింది. ఇంకా కొంచెం మిగిలితే రాత్రికి పనికి వస్తుందని మూటకట్టి లేచాడు సుందరం. "ఇంక ఈ పూటకి పర్వాలేదు. ఇంటికి వెళ్ళి ఒక్క కునుకు లాగితే ప్రాణం తేలిక పడుతుంది" అనుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

నాలుగడుగులు వేశాడో లేదో వెనుకనుంచి తననెవరో వెంబడిస్తున్నట్లు తోచింది. వెనుదిరిగి చూస్తే, "ఊః ఊః" అంటే ఆ చీడకుక్క తన వెనకాలే వస్తోంది. తాను వెనకకి తిరగ్గానే అది అక్కడే ఆగిపోయి నోరు తెరచి నాలిక చాపి, తోకాడించడం మొదలు పెట్టింది. దాన్ని చూచి ఒక శుష్కహాసం చేసి, అదే పోతుందిలే అనుకొని తిరిగి బయలుదేరాడు. కాని అదికూడా వెంబడిస్తోంది. కొంతదూరం వెళ్ళేసరికి అతనికి చిరాకెత్తింది. వెనుదిరిగి అదలించి కొంచెం దూరం తరమి, తిరిగి ముందుకు పోయాడు. అది వెనక్కు వెళ్ళినట్లే వెళ్ళి మళ్ళీ వచ్చి అతన్ని వెంబడించడం మొదలు పెట్టింది.

సుందరానికి విసుగుపుట్టి, "అది ఎంతదూరం వస్తుందో రానీలే. కొంచెం దూరం వచ్చి అదే పోతుంది" అనుకొని సాగిపోతున్నాడు. కుక్కమాత్రం వెంబడిస్తూనే ఉంది. దారిలో సినిమా హాలు దగ్గర, ఎండని కూడా లెక్కచెయ్యక, మ్యాట్నీకోసం జనం కొట్టుకుంటున్నారు. సినిమా అనే పేరు వినడమే గాని అది ఎల్లాగుంటుందో తాను చూచి ఎరుగడు. ఈ సినిమా తను ఒక్కసారి చూడగలిగితే ఎంత బాగుండును? ఆశగా హాలువైపు చూశాడు సుందరం. "కుష్టురోగులకు ప్రవేశము లేదు' ' అన్న గోడమీద అక్షరాలు అతన్ని చూచి వెకిలిగా నవ్వాయి. విచారంతో తలవంచుకున్నాడు. హాలు వాళ్ళు పెట్టిన రికార్డులు మైకులో నుంచి బయటకు వినిపిస్తున్నాయి. ఒక పదినిమిషాలు, అవి అయిపోయేవరకు విని, బరువుగా నిట్టూర్చి తిరిగి బయలుదేరాడు. ఈ పరధ్యానంలో కుక్క సంగతే మరచిపోయాడు. అది మాత్రం అతనిని అనుసరిస్తూనే ఉంది. గూడు చేరుకొని స్తంభానికి జేరగిలబడి ఎదురుగా చూసేసరికి, తోకాడిస్తూ కూర్చొనుంది ఆ చీడకుక్క. దాని విశ్వాసం చూసేసరికి అతనికి అదంటే ఉన్న అసహ్యం పోయింది. దాని దగ్గరకు చిరునవ్వుతో వెళ్ళి నెత్తిన చేతితో తట్టి, తిరిగి వచ్చి నడుం వాల్చాడు. అలసిపోయి ఉన్నాడేమో నిద్రాదేవి కౌగిట్లోకి వెంటనే వెళ్ళిపోయాడు. కుక్క కూడా విధేయతతో అతని కాళ్ళ దగ్గర పడుకుని అతన్ని అనుసరించింది.

ప్రాణులలో సాన్నిహిత్యం, సారూప్యం ఎక్కువైతే - అభిమానం కూడా ఎక్కువవుతుంది. మొదట్లో సుందరం ఆ కుక్కని ఎంత అసహ్యించుకున్నా దాని విశ్వాసం చూసిన తర్వాత అతనికి అదంటే అభిమాన మేర్పడింది. దానిని చూసి ప్రాణస్నేహితుడు లభించినట్లుగా మురిసిపోయేవాడు. దాని ఆటపాటలలో గంటలు సెకన్ల వలె గడిపి వేసేవాడు. ప్రతిరోజూ దానిని తన వెంట పెట్టుకుని ముష్టికి తీసుకెళ్ళేవాడు. అది విధేయతతో అతన్ని అనుసరించేది. దొరికిన దానిని ఇద్దరూ తినేవారు. సుందరం ఉన్నంతలో దానికి మాత్రం లోటు రానిచ్చేవాడు కాదు. ఈ కుష్టురోగి, చీడకుక్కతో ముష్టికి బయలుదేరడం చూసేసరికి నవ్వు గొల్పుతూ ఉండేది. కాని దేనినీ లక్ష్యపెట్టేవాడు కాదు సుందరం. క్రమేపీ దానికి అలవాటు చేసి తన భిక్షాపాత్రను దాని నోటికి తగలించడం మొదలుపెట్టాడు. అదిమాత్రం చూపరులకు విచిత్రంగా ఉండేది. దానికి ఆప్యాయంగా "మోతీ" అని పేరు పెట్టాడు సుందరం.

* * *

ఆరోజు ఆలస్యంగా ముష్టినుంచి తిరిగివచ్చి అలసివొళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. అతని కాళ్ళవద్దనే పడుకొనుంది మోతీ. దాని అరుపులతో మెలుకువ వచ్చింది సుందరానికి. కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా ఒక జీప్ ఆగి వుంది. అందులోంచి ఎవరో ముగ్గురు ఉద్యోగస్తులు, ఒక డవాలీ బంట్రోతు దిగారు. వారిని చూసే మోతీ మొరుగుతోంది. వాళ్ళని చూసి లేచి నుంచున్నాడు సుందరం.

వాళ్లు అతన్ని చూసి ఆగారు. బంట్రోతు, "ఏయ్! ఎవరివయ్యా నువ్వు?" అని ప్రశ్నించాడు.

సుందరం చేతులు కట్టుకొని "ముష్టోణ్ణి బాబయ్యా ... దిక్కులేనోణ్ణి .... ఈడనే ఉంటాను' అన్నాడు.

ఆ ఉద్యోగస్తులలో ఒకాయన, "ఈ గుడిలో పురాతత్త్వ శాఖవారు త్రవ్వకాలు జరుపబోతున్నారు. ఆ తర్వాత గుడిని పునరుద్ధరిస్తారు. నీవు ఇక్కడ నుంచి ఖాళీ చేయాలి" అన్నాడు.

ఆ గుడిని ఖాళీ చేయాలనగానే సుందరంపై పిడుగుపడినట్లయింది. బుర్రగోక్కుంటూ "ఏంది బాబయ్యా అంటూండారు?" అన్నాడు.

ఆయన "ప్రభుత్వం వారు ఈ గుడిని స్వాధీనం చేసుకుంటున్నారు. నీవు ఇక్కడినుండి వెళ్ళిపోవాలి" అన్నాడు. సుందరం అనేది వినకుండా "తప్పదయ్యా రేపే పని మొదలు పెడ్తారు ..... రేపు ప్రొద్దున కల్లా ఖాళీ చేయాలి" అన్నాడు.

సుందరం ఒక్క క్షణం అల్లాగే ఉండి "రేపటిదాకా ఎందుకు బాలయ్యా! ఇప్పుడే ఖాళీ చేస్తా ..... నాకేమి సామానుగనకనా?" అని కళ్ళు తుడుచుకుంటే, "రా మోతీ! పోదాం" అన్నాడు ముష్టి సంచీ తీసుకుని. మోతీ అతన్ని అనుసరించింది.

వెళ్తూ వెళ్తూ ఆ శిథిలమైన గోడలో నుంచి కన్పించే ఆ శిథిల లింగానికి దూరంనుంచే నమస్కారం పెట్టి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు సుందరం. తాను శిథిలమైనప్పుడు, ఆ నికృష్టుడికి ఆశ్రయం ఇచ్చింది ఆ గుడి. తాను పునరుద్ధరింపబడబోతూ ఆ నిర్భాగ్యుని వెడల నడిపింది అదే గుడి. ఈ దురన్యాయాన్ని చూడలేక కన్నీరు కారుస్తున్నట్లు చెట్లనుండి రాలుతున్నాయి పండుటాకులు.

*(విజయ మాసపత్రిక, నవంబర్ 1977) (దీని ఆంగ్ల అనువాదం THE GOD FORSAKEN, ఇంటర్నేషనల్ పి.ఇ.ఎన్. సౌల్ (కొరియా) వారి గ్రంథం 'THE ASIAN LITERATURE'లో ప్రచురితం)*